అనురాగ పుటంచులు చూస్తాం

రండి; ఇదిగో నూనె గిన్నె అదుగో తువ్వాలు - ఆ తువ్వాలు చుట్టుకుని ఈ నూనె వంటికిరాసు కోండి; ఏదీ తలెత్తండి - నెత్తిమీద -

మీ అమ్మ కడుపు చల్లగా

మీ అత్తకడుపు చల్లగా -

# బొమ్మలు బొమ్మలు బొమ్మలు

బొమ్మలకొలువు ఎప్పుడొస్తుందా అని ఆ బొమ్మల పెట్టికేసి ఎంత ఆశగాచూసేవాళ్ళం; ఆఖరికి ఓ రోజు -

మా అమ్మ గడపవతల తలుపు దగ్గర నిలబడి పిల్లలు దసరాకు బొమ్మలు పెట్టుకోవాలను కుంటున్నారండీ అని చెప్పేది.

అంత చల్లగా, తీయగా మాట్లాడే అమ్మమాటలు నాన్న కెందుకో అంత చల్లగా తీయగా వినిపించేవి కావు.

ఆ బొమ్మలన్నీ పెట్టెలోంచి తీసి మా అమ్మ నేలమీద పరిచేది.

కష్టపడి డబ్బులు మిగిల్చి మానాన్నకు తెలియకుండా ఒకొక్క బొమ్మా తను ఎలా కొన్నదీ మా అమ్మచెబుతోంటే మా నాన్నగారి మీద చెడ్డకోపం వచ్చేది మాకు.

మేం విరగ కొట్టేస్తావేమోనని. కన్నతల్లి ప్రేమలా వెన్నెలలా అమృతం కురిపించే కళ్ళతో మా కేసి బొమ్మలకేసి మార్చి మార్చి చూస్తూ ఆ బొమ్మలను పొందికగా పట్టుకుని గుండెలకు హత్తుకుని నెమ్మదిగా తుడిచేది.

విరిగిన ముక్కులు. చేతులు, కాళ్లుసర్వీసు పెట్టి అతికించి కుంచె తీసుకుని తన మనసులోని రంగులన్నీ పులిమేది.

ఆ దసరా బొమ్మల కొలువు ఎంత చిత్తాకర్షకంగా వుండేది?

పది తలల రావణాసురుడు.

ముందు తోకను చుట్ట పెట్టుకుని ఎత్తునకూర్చున్న హనుమంతుడు పారాడే కృష్ణుడు శిఖిపింఛమువాగ్గ

గట్టుమీగ కూర్చుని వీణవాయించుగుంటున్న సరస్వతి. తామరపూవులో ఒక కాలుకాస్త వంచి అభయహస్తమిస్తూ వయ్యారంగానిల్చున్న లక్ష్మీదేవి;

చారల పులిమీద భయంలేకుండా కూర్చున్న దుర్గాభవాని - శేషశాయి, పాముమీదపడుకున్న

విష్ణుమూర్తి బొడ్డులోనుంచి కమలాసనుడు, కాళ్ళ దగ్గర లక్ష్మీదేవి, చేతులు కట్టుకుని నిలబడిన నారదుడు, గరుత్మంతుడు.

రొమ్ముల దగ్గరికి కోసినట్లు చేసిన శివపార్వతుల సగం బొమ్మ,

రాధాకృష్ణులు గోవు నానుకుని చెట్టు క్రింద నిల్చున్న బొమ్మ... మోకాళ్ళపైకి గౌనుతొడుక్కున్న దొరసాని.

కొల్లాయి గట్టి చేతికర్రతో షికారుకు బయలుదేరిన గాంధీగారు, అరటిపళ్ల అత్తం, హాయిగా పడుకున్న నల్లటి మచ్చలున్న తెల్లటి కుక్కలు రెండు, చారల పెద్దపులులు రెండు, సాయిబుగారు, పంచాంగబ్రాహ్మడు, పొట్టబ్రాహ్మడు.... కీ యిచ్చేకారు, మూడు చక్రాల సైకిలు సిమెంటు చెరువులో కర్పూరపు బాతులు – చిన్నతోట – పిక్నిక్కు పార్టీ వంతెన.... కొండలు, చెట్లు... ఇంకా ఎన్నో.... నిద్రాహారాలుమాని మా అమ్మ మేమూ పిల్లలందరమూ కలిసి ఎన్నెన్ని కొత్తకొత్త రకాలుగా, ఎంతగా, అందంగా కనిపించేలా అమర్చేవాళ్ళం బొమ్మలకొలువు?

మేం ఆడ పిల్లలం మెళ్ళో గంధాలురాసుకొని బొట్టూ కాటుక పెట్టుకొని, కొత్త పరికిణీలు కట్టుకుని, పట్టు చీరలు కట్టుకున్న ఆడవాళ్ళతో వీధిలోనడుస్తూంటే ఆకాశం వంగి తొంగి చూసి మాతలలు నిమిరి మమ్మల్ని బుజ్జగించి మళ్లీ పైకి వెళ్లిపోయేది.

సర్కసు వెళ్లి పోయిందనగానే లాటరీలో వచ్చిన డబ్బంతా ఖర్చయిందనగానే ఎలావుంటుందో ఆ పండగ వెళ్లిపోయిన రోజున బొమ్మలకొలువు ఎత్తేయాలంటే అంత చెడ్డదిగులుగానూ వుంటుంది.

అంత ఠీవీగా, అంత దర్జాగా షోగ్గా కొలువు తీర్చిన ఆ అందమైన బొమ్మలన్నీ మళ్లీ అలమార్లలోకి గూళ్ళలోకి, పెట్టె అడుక్కి వెళ్ళిదాక్కుంటాయి.

మేమేకాదు మా అమ్మకూడా డల్‌గా తిరుగుతుంది ఇంట్లో, ఆరోజు మానాన్న గారొక్క రేసంతోషిస్తూనట్లు ఈజీచైర్లో పరమ ఈజీగా పడుకుని పేపరు చదువుకుంటూ వుంటారు.

కొన్నేళ్ళకు కొన్నాళ్ళకు –

సరిగా అప్పుడే – మావారు "వస్తానండీ" బాగ్ చేత్తోపట్టుకుని మా నడవలోంచి గుమ్మంవరకూ ఆడదాని గుండెల మీదనుంచి లెక్కచేయకుండా – వుండమంటే వుండకుండా నడిచి వెళ్ళిపోయేవారు బస్సు నందుకుందుకు.

ఆ కాళీగోడలు, ఆమాములు వాతావరణం చూస్తూంటే నా కేడుపొచ్చేసేది. మా అమ్మ ఈరవ్వలడ్డు రుచి – చూడే అంటూ పట్టుకొచ్చిస్తే, ఆ రవ్వలడ్డుచితిపేసి పళ్ళెం విసిరేసి తలమంచానేసి కొట్టుకుంటూ ఏడ్చేదాన్ని.

"ఉండ మంటూంటే వినకుండా ఆ పిల్లాడు వెళ్ళిపోయాడే – వెళ్లేదాకా చూస్తూ వూరుకుని యిప్పుడు గొడవచేస్తే ఏవిటి లాభం?" అని మా అమ్మ నన్ను ఓదార్చేది.

ఏ పిల్లాడు? ఆ పిల్లాడు నలిగిపోయిన క్రొత్తబట్టలు తొడుక్కుని ఏ బస్సు స్టాండులోనో, రైల్వేప్లాట్‌ఫారంలోనో సిగరెట్ పీలుస్తూ మెళ్లో సంచితో హోల్డాలుమీద బూటుకాల్తో లయవేస్తూ

ఆలోచిస్తూ నిల్చునుంటాడు. అప్పుడు నాకోపాత సినిమా పాట జ్ఞాపకం వచ్చేది. లైలామజ్నూలోది.

ప్రేమ నేరమౌనా
మా పై యీ పగేలా
వేదనగానే మా వలపంతా వేసారునా?

ఇప్పుడా ఊర్పులూ నిట్టూర్పులు లేవు.

సిగరెట్టు పీలుస్తూ హోల్డాలుమీద బూటుకాలుతో లయవేస్తూ ప్లాటు ఫారంమీద నిలబడ్డ అబ్బాయి గుండెలలో నాట్యం చేసిన ఆడపిల్ల ఏటా కానుపుల్తో రోగాల్తో నలిగి నల్లిక నరంలా అయిపోయి ఎండకెండి, వానకుతడసిన గొడ్డు మాదిరి జీవితాని కలవాటుపడిపోయింది.

ఒకరోజు సాయంత్రం జీరోబల్బు కాంతిలో కాళ్ళమీద పాపను పడుకోబెట్టుకుని గోడకు చారగిలబడి కూర్చున్న ఆతల్లిని ఎదురుకుంటూ వచ్చిన కూతురుపిల్ల అడిగింది.

"అమ్మా బొమ్మ లెట్టుకుందామే" అని

ఆజీరో బల్బు కాంతిలో ఏడుపును నిగ్రహించుకుంటూ -

"అయ్యో తల్లీ; నే నేవీ బొమ్మల్ని ప్రోగు చెయ్యలేదే..." అని పుడకల్లాటి చేతుల్ని శూన్యంలో త్రిప్పుతూ చీకట్లోకి మరింత చీకటిని కుమ్మరించేలా గుమ్మరించింది మాటలు.

ఆకూతురుపిల్ల మరెప్పుడూ బొమ్మల మాటెత్తలేదు.

తాటాకు బొమ్మలు చేసుకుని అరుగుమూల ఆడుకోవడం అలవాటు చేసుకుంది. కాని ఆ పిల్ల తల్లి బొమ్మల్ను చూసినప్పుడల్లా కళ్ళ నీళ్లు పెట్టుకుంటూనే వుంటుంది అర్థంపర్థం లేకుండా-

# ఘర్ ఘర్ మె దివాలీ

రెండెడ్ల బండి మీద "షావుకారు" సినిమా కెళ్ళాం గుర్తుందీ?

ఎండు గడ్డి ఒత్తుగా వేసి ఎంప్రెస్ మిల్సు కొత్త దుప్పటి పరిచి అమ్మాయిగార్నీ, అబ్బాయి గార్నీ పువ్వుల్లా నలక్కుండా కూకో పెట్టి తీసుకెళ్ళి తీసుకొస్తానన్నాడు బండెంకట సుబ్బడు.

దారిలో ఆకలేస్తే తినడానికి జీళ్ళు, చేగోడీలు పాకం పట్టిన గోధుమ గవ్వలు, దాహం వేస్తే గొంతుకెండి పోకుండా మంచి నీళ్ళ కోసం మరచెంబు యిచ్చి, బండి రోడ్డెక్కేవరకూ కాలవగట్టు దాకా నడిచి "జాగ్రత్తగా వెళ్ళిరండి" అంటూ వెర్రి ఆపేక్షతో సాగనంపేది మా అమ్మ.

ఆ కాలువ నీళ్ళ చల్లదనం, ఆ గాలిలోని హాయి, ఆ చెట్ల క్రింద మువ్వలు చప్పుడు చేసుకుంటూ పరిగెత్తే రెండెడ్ల బండి దూకుడు. ఆ వేళ మనల్ని ఆశీర్వదించి నెత్తిమీద నుంచి